పల్లెల్లో అభివృద్ధి పండగ



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జనసేన నాయకులు గంగులయ్య తదితరులు

పాడేరు, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు, నాయకుల సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నామని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం గొండెలి, ఇరాడ పల్లి పంచాయతీ లాడాపుట్టు గ్రామంలో జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గ్రామాల్లో తీర్మానాల ద్వారా గుర్తించిన అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పల్లెల్లో పండగ వాతావరణం కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి పల్లె పండగ పేరు పెట్టడం సంతోషకర మన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గొండెలి గ్రామంలో ఈ- క్రాప్ నమోదును పరిశీలించారు. రైతులు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతే ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. సంప్రదాయ పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె పండగ కార్యక్రమానికి స్పందన వస్తోందన్నారు. గత వైకాపా ప్రభుత్వం గ్రామాల్లో కనీస వసతులు కల్పించలేదని విమర్శించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, జనసేన నాయకులు వంపూరి గంగులయ్య, ఎంపీపీ రత్నకుమారి, ఎంపీడీఓ డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి స్ఫూర్తి కొనసాగించాలని కోరా!

★ అమెరికా పర్యటనలో ప్రవాసుల ఆదరణ అపూర్వం
★ వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రభుత్వం సిద్ధం
★ 'ఈనాడు'తో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

పుట్టిన ఊరు, ప్రాంతం అభివృద్ధి కోసం గతంలో మాదిరిగానే జన్మభూమి స్ఫూరిని కొనసాగించాలని ప్రవాసాంధ్రులను కోరినట్లు శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు చెప్పారు.





గ్రేటర్ వాషింగ్టన్ తెలుగు సాంస్కృతిక సంఘం 50వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా అమెరికా వెళ్లారు. వాషింగ్టన్ డీసీ, లీస్‌బర్గ్ అట్లాంటా, డాలస్, న్యూజెర్సీ రాష్ట్రాల్లో పర్యటించారు. ఇటీవలే సొంత నియోజకవర్గానికి చేరుకుని పల్లెపండగ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తన అమెరికా పర్యటన, అక్కడి తెలుగువారు చూపిన ఆదరణ, వారి ఆకాంక్షల గురించి 'ఈనాడు'కు వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి..

ప్రవాసాంధ్రుల్లో చాలామంది మన రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించి వందల మందికి ఉపాధి కల్పించేందుకు సుముఖంగా ఉన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడితే సహకరిస్తారా అని అడిగారు. ఇక్కడ కంపెనీల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో రాయితీలు ఇస్తున్న విషయం వారికి వివరించా. ఎన్నారైలు స్థాపించబోయే పరిశ్రమలకు అవసరమైన భూమి, ఇతర రాయితీలను త్వరితంగా అందించేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఔత్సాహికులకు తెలియజేశా.

అమెరికాలో నివసిస్తున్న తెలుగువారు రాష్ట్రానికి వచ్చినప్పుడు భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో కలిసి తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునే అవకాశం కల్పించమని అడిగారు. ప్రస్తుతం భార్య, భర్తకు మాత్రమే ఈ సదుపాయం అమల్లో ఉంది. కుటుంబంతో దర్శించుకోవాలన్న వారి ఆకాంక్ష సమంజసం. నాతో పాటు ఎన్నారై సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వచ్చారు. మేమిద్దరం ప్రవాసాంధ్రుల ఆశలు, కోర్కెలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి వాటిని నెరవేర్చాలని కోరతాం.

సేవా కార్యక్రమాలు చేపట్టాలని..

అమెరికాలో పర్యటించినప్పుడు వేలాది మంది ప్రవాసాంధ్రులను కలిశాను. వారిలో ఓ కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రానికి పూర్వవైభవం వస్తుందని వారు విశ్వసిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రుల భాగస్వామ్యం కోసం గతంలో జన్మభూమి పేరుతో కార్యక్రమాలు చేపట్టగా ఎంతోమంది ఎన్నారైలు ముందుకొచ్చారు. ఇప్పుడు కూడా అదే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టడానికి సహకరించాలని కోరాను. అమెరికాలో లక్షమందికి పైగా తెలుగువారున్నారు. వారంతా తమతమ ఊళ్లలో పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఉదారంగా సాయం చేస్తుండాలి. ఇలా చేస్తే తక్కువ కాలంలోనే ఎక్కువ అభివృద్ధి చూపడానికి అవకాశం ఉంటుందని గుర్తుచేశాను. నా ప్రతిపాదనకు వారంతా సానుకూలంగా స్పందించారు. తమ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పడం చాలా సంతోషం అనిపించింది.

అప్పుడు కోడెల.. ఇప్పుడే నేను..

'అమెరికా పర్యటన ఎంతో సంతృప్తినిచ్చింది. తెలుగువారు బాగా ఆదరించారు. వారి ఇళ్లకు వెళ్లి ఒకట్రెండు రోజులు అక్కడే గడిపాం. నాలుగైదు రాష్ట్రాల్లో వేలాది మంది ప్రవాసాంధ్రులతో అయిదారు సమావేశాలు నిర్వహించారు. తెలుగు సాంస్కృతిక సంఘం 40వ వార్షికోత్సవానికి అప్పట్లో స్పీకర్‌గా ఉన్న కోడెల శివప్రసాదరావు ముఖ్య అతిథిగా వెళ్లారు.. రజతోత్సవానికి నేనూ స్పీకర్‌గా పాల్గొనడం ఆనందం కలిగించింది. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో రాక్షస పాలన చూసిన ఎన్నారైలు ఎలాగైనా ఇక్కడి పాలన మారాలని, మళ్లీ చంద్రబాబు రావాలని ఎంతగానో తపించారు. రూ. లక్షలు ఖర్చు పెట్టుకుని సొంతూళ్లకు వచ్చి ఓటేసి వెళ్లారు. అమెరికాలో ఉంటూనే ఇక్కడి ఓటర్లను చైతన్యం చేశారు. వారు అందించిన సహకారాన్ని మర్చిపోలేం. రాష్ట్రంలో వారికి తగిన గౌరవాన్ని అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామ'ని సభాపతి వివరించారు.



అమెరికాలో అయ్యన్న దంపతులకు పురస్కారం

పులి సంచారంపై అప్రమత్తం



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై లతశ్రీ

కూనవరం, న్యూస్‌టుడే: మండలంలోని అటవీ ప్రాంతాల్లో పులి సంచారం వాస్తవమేనని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎల్. లతశ్రీ, ఎఫ్ఆర్వో కరుణాకర్ హెచ్చరించారు. దూగుట్ట, కాచవరం, నర్సింగపేట గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. పులి సంచరిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు నిర్ధారించారని, ఈ సమయంలో అడవులకు సమీపంలోని గ్రామాల వారు ఒంటరిగా అడవుల్లోకి వెళ్లవద్దన్నారు. పశువులను మేపడానికి, అటవీ ఉత్పత్తులు సేకరించడానికి కొంతకాలం వెళ్లకపోవడం మంచిదన్నారు. పులి ఆచూకీ తెలిసిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. పులిని సంహరించడం కోసం విద్యుత్తు తీగలు అమర్చడం, విషపూరిత ఆహారం పెట్టడం చేయకూడదన్నారు.



పాలగూడెంలో పాదముద్ర

రామచంద్రాపురం అడవుల్లో..

కూనవరం, న్యూస్‌టుడే: రామచంద్రాపురం అటవీ ప్రాంతంలో పులి సంచారంపై అటవీశాఖ అధికారులు నిఘా పెట్టారు. గ్రామాలను ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతాలను జల్లెడపడుతున్నారు. దూగుట్టలో మంగళవారం పులి పాదముద్రలను గుర్తించిన అధికారులు పాలగూడెం, రామచంద్రాపురం అడవుల్లో తాజాగా బుధవారం దాని పాదముద్రలు గుర్తించారు. పులి సంతానోత్పత్తి క్రమంలో మగ పులి తన సరిహద్దును ఏర్పాటు చేసుకుంటుందని, ఆ క్రమంలో సుమారు వంద కిలోమీటర్ల వరకు తన ఆనవాళ్లను ఇతర జంతువులకు హెచ్చరికగా వదులుతుందని ఎఫ్ఆర్వో ఎం.కరుణాకర్ చెప్పారు. ఇది మన సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చి ఉండొచ్చన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు, తదితరులు

అరకులోయ, న్యూస్‌టుడే: యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఈవో బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. అరకులోయలోని క్రీడా పాఠశాల ఆవరణలో బుధవారం అండర్-14, అండర్-17 విభాగాల్లో జిల్లాస్థాయి విలువిద్య పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజన యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభ చూపించే యువతకు క్రీడా కోటాలో ఉద్యోగావకాశాలు ఉంటాయని చెప్పారు. వీటిని గిరి యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు మన్యం జిల్లాలో నవంబర్ 3న నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంఈవో త్రినాథరావు, క్రీడా పాఠశాల ప్రిన్సిపల్ మూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొండబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ నిమజ్జనం

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో విజయదుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం బుధవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో జరిగింది. విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి పట్టుచీరను లాటరీ వేయగా.. దుర్గావీధికి చెందిన అంజిత్ దక్కించుకున్నారు. ఊరేగింపులో థింసా నృత్యాలు, డీజే డాన్సులు, శక్తి వేషాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సీలేరు జలాశయంలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.



అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న నిర్వాహకులు



ఆకట్టుకున్న వేషధారణలు

పొట్టేల్ చిత్ర బృందం సందడి



ఈ నెల 25న విడుదలయ్యే పొట్టేల్ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని ఆ సినిమా హీరోయిన్ అనన్య నాగళ్ల తెలిపారు. చిత్ర యూనిట్ హైదరాబాద్ నుంచి బస్సుయాత్ర చేస్తూ బుధవారం బీచ్‌రోడ్డుకు వచ్చింది. హీరో యవన్‌కృష్ణ, నటులు అజయ్‌పాత్ర, నోయల్, దర్శకుడు సాహిత్ మొతుకూరి తదితరులు సందడి చేశారు. –పెదవాల్తేరు, న్యూస్‌టుడే

కాఫీ రైతు పంట పండినట్లే!

★ గతేడాది కంటే కేజీకి రూ.5 పెంపు ★ ఇంటి వద్దే కొనుగోలుకు చర్యలు



కాఫీ పండ్లను శుద్ధి చేస్తున్న రైతులు

-పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

మన్యం కాఫీ రైతుల ఆదాయం పెంచేలా అడుగులు పడ్డాయి. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పడిన అపెక్సు కమిటీ.. నాణ్యమైన కాఫీకి జీసీసీ ఆధ్వర్యంలో చెల్లించే ధరను తాజాగా ప్రకటించింది. గతేడాది కేజీ పార్చిమెంట్ రూ.280 ఉండగా.. ఈ ఏడాది రూ.285కు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. గతానికి భిన్నంగా ఈసారి గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో రైతుల ఇంటి వద్దే కొనుగోలు చేయనున్నట్లు ఆ సంస్థ ఎండీ కల్పనా కుమారి ప్రకటించడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

24 నాలుగు గంటల్లో జమ

ఈ ఆర్థిక సంవత్సరంలో 2000 మెట్రిక్ టన్నుల సేకరణను లక్ష్యంగా చేసుకున్న జీసీసీ దీనికి తగ్గట్లుగా ప్రణాళిక రూపొందించి ముందుకెళ్తోంది. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అపెక్సు కమిటీ సభ్యులు ఈ నెల 14వ తేదీన విశాఖపట్నంలో సమావేశమై కాఫీ ధరలను ఖరారు చేశారు. కేజీ అరబికా పార్చిమెంట్ ధరను రూ.285లుగా నిర్ణయించారు. అరబికా చెర్రీ కేజీ రూ.150గా పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే కేజీకి రూ. 5 పెంచారు. కాఫీ సేకరణ చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని జీసీసీ ప్రకటించడం విశేషం. గతంలో బ్యాంకు ఖాతాల్లో తక్షణమే నగదు జమయ్యేది కాదు. గతంలో వారపు సంతల్లో మాత్రమే కాఫీ కొనుగోలు కేంద్రాలు ఉండేవి. దీంతో రైతులు అక్కడకు వెళ్లకుండా వారికి నచ్చిన వ్యాపారుల వద్దకు వెళ్లి సరకు విక్రయించుకునేవారు. ఇప్పుడు ఈ విధానాన్ని పూర్తిగా మార్చేసింది.

పాడేరు డివిజన్‌లో వివరాలిలా..

- » కాఫీ తోటలు: 1.5 లక్షల ఎకరాలు
- » రైతులు: సుమారు 1.5 లక్షల మంది
- » ఈ ఏడాది కాఫీ ఉత్పత్తి అంచనా: 10 వేల మెట్రిక్ టన్నులు
- » జీసీసీ సేకరణ లక్ష్యం: 2 వేల మెట్రిక్ టన్నులు
- » 2023-24లో జీసీసీ సేకరించిన కాఫీ: 565 మెట్రిక్ టన్నులు
- » దేశీయ మార్కెట్ కేంద్రం: బెంగళూరు





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

గిట్టుబాటు ధర కల్పనకు కృషి

పాడేరు, న్యూస్‌టుడే: అరకు కాఫీ వ్యాపారం పెరగడానికి పటిష్ఠ చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో గిరిజన ప్రాంతంలో పండించే కాఫీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాఫీ, వ్యవసాయ, ఉద్యాన, జీసీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నాణ్యమైన కాఫీ పండ్లు సేకరించేలా గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గిట్టుబాటు ధర కల్పించడానికి అధికారులు కృషి చేయాలని చెప్పారు. చింతపల్లిలో వేలం నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. సెర్ప్ మాదిరిగా కాఫీ రైతుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. జీసీసీ ఎండీ కల్పనాకుమారి, ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ వర్చువల్‌గా పాల్గొన్నారు. కాఫీ సహాయ సంచాలకులు ఎన్ అశోక్, డీడీ రమేష్, జిల్లా వ్యవసాయ సంచాలకులు రాకేష్, జీసీసీ డీఎంలు సింహాచలం, దేవరాజ్ పాల్గొన్నారు.

రూ.5.19 కోట్ల బకాయిలు విడుదల

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాడేరు డివిజన్ పదకొండు మండలాల్లోని కాఫీ తోటల్లో రీ-ఫిల్లింగ్ (మొక్కల పునరుద్ధరణ)కు సంబంధించిన బకాయిలు విడుదలైనట్లు ఐటీడీఏ కాఫీ విభాగం ఏడీ అశోక్ బుధవారం తెలిపారు. ఏజెన్సీవ్యాప్తంగా 12,999 ఎకరాల్లో పాడైన మొక్కల స్థానంలో కొత్తవి నాటారు. దీనికి సంబంధించి ప్రతి రైతుకు రూ.4 వేలు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం సొమ్ము సుమారు రూ.5.19 కోట్లు నిధులు విడుదలయ్యాయి. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల సర్వే నిర్వహిస్తున్నారు. రైతు బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు నంబర్లు సేకరిస్తున్నారు. ప్రతి ఎకరాకు రూ.4 వేల చొప్పున సొమ్మును వారి ఖాతాల్లో త్వరలో జమ చేయనున్నారు. గత కొన్నాళ్లుగా పేరుకుపోయిన బకాయిలు విడుదల కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్పందనకు వందన — కల్వర్టు నిర్మాణానికి రూ.16.50 లక్షలు



గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

జి.అద్దరవీధిలో వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు నిర్మాణానికి రూ. 16.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. మండల కేంద్రానికి సమీపంలోని ఈ గ్రామంలో 30 ఏళ్ల క్రితం పంట కాలువ నిర్మించారు. ఈ కాలువపై నుంచి సీలేరు ప్రధాన రహదారి మీదుగా జి.అద్దరవీధి వెళ్లే మార్గంలో కల్వర్టు ఉంది. పంట కాలువ పూడికపోవడంతో గత జులైలో కురిసిన వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయింది. రహదారిపైనే నీళ్లు పారుతుండటం, పక్కనే విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రమాదాలు జరిగే ముప్పు ఉందని ఆగస్టు 1న తెగిన కల్వర్టు.. పొంచి ఉన్న ప్రమాదం శీర్షికన ఈనాడులో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ వెంటనే అధికారులను పంపగా వారు పరిశీలించి నివేదిక సమర్పించారు. కల్వర్టు నిర్మాణానికి పీవో చర్యలు తీసుకున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా కొత్త కల్వర్టు నిర్మాణానికి రూ. 16.50 లక్షల నిధులు మంజూరు చేయించారని మండల కో ఆప్షన్ సభ్యుడు దావీదు తెలిపారు.



పీవో ఆదేశాలతో కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న అధికారులు (పాతచిత్రం)

రెండు మద్యం దుకాణాలు సీలేరులోనేనా?

సీలేరు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల లాటరీలో అధికారుల తప్పిదంతో గూడెంకొత్తవీధి మండలానికి వచ్చిన రెండు దుకాణాలు సీలేరులోనే పెట్టడానికి ఒకరికొకరు పోటీపడుతున్నారు. ఈనెల 14న నిర్వహించిన లాటరీలో 20, 21 నంబర్ల దుకాణాలను లాటరీలో కె.వీరేంద్రప్రసాద్, కె.గంగాధర్ దక్కించుకున్నారు. వీరు మండలంలో ఎక్కడైనా దుకాణాలు పెట్టుకోవచ్చునని అధికారులు సూచించడంతో సీలేరులోనే ఏర్పాటు చేయడానికి పోటీపడుతున్నారు. ఒకవర్గం మంగళవారం ఇక్కడకు వచ్చి పరిశీలించారు. రెండో వర్గం బుధవారం వచ్చి మరో రెండు దుకాణాలను చూశారు. ఇక్కడే దుకాణాలు పెట్టడానికి ఇద్దరూ పోటీ పడటానికి కారణం మద్యం వ్యాపారం ఎక్కువగా ఉంటుంది. ఒడిశాకు సరిహద్దు కావడంతో కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతాయి. సీలేరులో మద్యం దుకాణం పెట్టడానికి పంచాయతీ తీర్మానం ఒక్కరికే ఇస్తామని పాలకవర్గ సభ్యులు చెబుతున్నారు. ఇరువర్గాలు ఆబ్కారీశాఖ అధికారుల దృష్టికి ఈ పంచాయితీ తీసుకెళ్లినట్లు సమాచారం.

ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్ రేపు

పాడేరు, న్యూస్‌టుడే: ఈనెల 18వ తేదీ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి ప్రతి నెలా మూడో శుక్రవారం సాయంత్రం 4 నుంచి ఆరు గంటల వరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగుల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, అధికారులు ఇందులో పాల్గొని వారి సమస్యలు తెలపవచ్చన్నారు. ఆరోజు ఉదయం యథావిధిగా మీ కోసం కార్యక్రమం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని వివరించారు.

చెట్టు కూలితే చేటే!

ముంచంగిపుట్టు నుంచి పెదబయలు, పాడేరు వెళ్లే ప్రధాన రహదారిలో లుంగాపుట్టు, వనబసింగి గ్రామాల మధ్య రోడ్డుకు ఆనుకుని ఉన్న చెట్టు ప్రమాదకరంగా మారింది. చెట్టు కొమ్మలు ఎండిపోయి, రోడ్డు వైపు వాలిపోయి వాహనచోదకులకు ఆందోళన కలిగిస్తోంది. ఎండిన కొమ్మలు వాహనచోదకులపై రాలుతున్నాయి. నిత్యం వాహనాలు తిరిగే మార్గంలో ఇది కూలి వాహనాలపై పడితే ప్రమాదాలు జరిగే ముప్పు ఉంది. రాకపోకలు స్తంభించే అవకాశాలు ఉన్నాయి. రహదారులు, భవనాలశాఖ అధికారులు ఈ చెట్టును తొలగించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే



గురువు లేక.. చదువు సాగక!



డుంబ్రిగుడ మండలం లైగండ పంచాయతీ పనసపుట్టులోని గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడి కోసం విద్యార్థులు ఎదురుచూపులు చూస్తున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రెండు నెలల క్రితం వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఇతర ఉపాధ్యాయులు లేకపోవడంతో చిన్నారులకు బోధన సాగడం లేదు. పిల్లలు బడికి వెళ్లి ఖాళీగా కూర్చొని మధ్యాహ్న భోజనం చేసి ఇంటికి వస్తున్నారు. సర్పంచి శాంతి మాట్లాడుతూ.. ఈ విషయంపై స్థానిక మండల విద్యాశాఖ అధికారి, గిరిజన సంక్షేమశాఖ సహాయ అధికారికి విన్నవించామని చెప్పారు. అదనంగా ఉపాధ్యాయుడిని నియమిస్తామని చెబుతున్నా ఇప్పటికీ అది జరగలేదన్నారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

తీర్మానాలు లేక.. గంటకే దుకాణాల మూత

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరంలో మధ్యాహ్నం నూతన మద్యం దుకాణాన్ని ప్రారంభించారు. దుకాణం తెరచిన గంటకే ఎక్సైజ్ అధికారులు వచ్చి దీన్ని మూసివేశారు. దీంతో ఎంతో ఉత్సాహంగా ప్రారంభించిన మద్యం వ్యాపారులు నిరాశ చెందారు. పీసా చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గ్రామసభలు ఏర్పాటు చేసి పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేయాల్సి ఉంది. ఎటువంటి తీర్మానాలు లేకుండానే మద్యం దుకాణాలు తెరవడంతో రంపచోడవరంతోపాటు మన్యంలో పలు దుకాణాలు మూసివేశారు. దీనిపై రంపచోడవరం ఎక్సైజ్‌శాఖ సీఐ శ్రీధర్‌ను వివరణ కోరగా మద్యం వ్యాపారులు గ్రామసభ తీర్మానాలను సమర్పించలేదన్నారు. తీర్మానాలు ఇచ్చాక దుకాణాలను తెరుచుకోవాలని సూచించినట్లు తెలిపారు.

నీలి వెన్నెల జాబిలి..

మది మురిసేను మరి!



నిశీధి వేళ నీలాకాశంలో చందమామ వెన్నెలను విరజిమ్ముతూ చెట్టు కొమ్మల చాటున సుందరంగా కనిపించి ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంది. గూడెంకొత్తవీధిలో బుధవారం రాత్రి వెన్నెల కురిపించిన జాబిలి కనువిందు చేసింది.

– న్యూస్‌టుడే, గూడెంకొత్తవీధి

గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించరా..!



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో నారాయణమూర్తి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ స్థాయీ కమిటీ సమావేశాలు బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగాయి. గ్రామీణాభివృద్ధి, జలవనరులు, గనులు, ప్రజా రవాణా, ప్రజా సంక్షేమ పనులు, రహదారులు, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించారు. ఛైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించలేదని, ఇది వరకు దరఖాస్తులు చేసుకున్న వారికి కొత్తగా గృహాలు మంజూరు కాలేదన్నారు. గ్రామసభల వివరాలను జడ్పీటీసీ సభ్యులకు తెలియజేయాలన్నారు. గ్రామ సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయి కనెక్షన్లపై దృష్టి సారించాలని కోరారు. ▮ మాడుగుల ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ వివిధ రూట్లలో నిలుపుదల చేసిన బస్సులను పునఃప్రారంభించాలని కోరారు. పూర్తి చేసిన పనుల నివేదికతో అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని కోరారు. జడ్పీ సీఈఓ నారాయణమూర్తి మాట్లాడుతూ ప్రతినెలా 1న 95శాతం వరకు పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. మండలస్థాయి రహదారులను ఉపాధి హామీ పథకం కింద, ఆర్ అండ్ బీ రహదారులను జడ్పీ నిధులతో నిర్మిస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో రూ.245కోట్ల మేర రహదారుల అభివృద్ధికి ఖర్చు చేసినట్లు చెప్పారు. నాలుగో స్థాయి కమిటీ సమావేశానికి పలువురు జడ్పీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. కోరం చాలకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

ఘనంగా షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి మండలం శరభవరంలో బుధవారం షిరిడీ సాయిబాబా ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జీవీఎస్ఎన్ రాజు, కుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పాలు, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయాన్ని ప్రత్యేక పూలతో అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక అలంకరణలో బాబా భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

> వైఎస్ఆర్ జగనన్న భూరక్ష రైతులకు అదనపు తలనొప్పులు తీసుకొచ్చింది. గతంలో ఉండే కొలతలకు, రీసర్వేకు తేడాలు, యాజమాని పేర్ల మార్పు, సరిహద్దుల్లో లోపాలు చోటుచేసుకున్నాయి.
>
> జగన్ సర్కార్ అస్తవ్యస్త విధానాలతో ఆదరాబాదరగా నిర్వహించిన సమగ్ర భూసర్వేలో లోపాలను సరిచేయడానికి కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. గ్రామసభలను నిర్వహించి ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడానికి చర్యలు తీసుకుంది.



అత్యాధునిక రోవర్ సర్వేలోనూ పొరపాట్లు



రీసర్వే తప్పులు సరిదిద్దేలా..

అచ్యుతాపురం, నర్సీపట్నం, న్యూస్‌టుడే

రీసర్వే వల్ల రైతులు పడిన ఇబ్బందులను తెలుసుకున్న కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈనెల 17 నుంచి నెలరోజుల పాటు గ్రామసభలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూశాఖను ఆదేశించింది. రైతుల నుంచి అర్జీలను స్వీకరించి 100 శాతం వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. సర్వే కాని గ్రామాల్లో దీనిని కొనసాగించాలని ఆదేశించింది. గతంలో మాదిరిగా మమ అనిపించకుండా ఒక్కో గ్రామానికి నాలుగు నెలలు సమయం కేటాయించారు. తూతూ మంత్రంగా నిర్వహిస్తే చర్యలు తప్పవని ఉద్యోగులను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది.

జగన్ చిత్రాల తొలగింపు చర్యలు

జగన్ చిత్రాలతో పట్టా పాసుపుస్తకాలను ముద్రించి రైతులకు అందించారు. ఈ చిత్రాలపై పెద్దఎత్తున విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. పొలాల్లో వేసిన సర్వేరాళ్లపైనా జగన్ చిత్రం ముద్రించి, పేరును రాయించారు. పాస్ పుస్తకాలపై జగన్ చిత్రం ఉండడంతో కొన్ని ప్రాంతాల్లో రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు, ప్రైవేటు సంస్థలు నిరాకరించాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని సర్వే రాళ్లపై చిత్రాలు, పేర్లను తొలగించాలని కూటమి సర్కారు నిర్ణయించింది. జగన్ చిత్రంతో ముద్రించిన పట్టాదారు పాసు పుస్తకాలను రద్దు చేసి అధికార చిహ్నంతో కొత్తగా పాసు పుస్తకాలు అందిస్తామని ప్రకటించింది. పొలాల్లో ఇష్టానుసారంగా వేసిన సర్వేరాళ్ల వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి వాటిని తొలగించాలని నిర్ణయించింది.



పొలాల్లో సర్వే రాళ్లు వేస్తున్న కూలీలు



రోజంతా సమస్యలపై అధ్యయనం: గతంలో రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేయడానికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది. సర్వే పూర్తయిన గ్రామాల్లో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే సిబ్బంది రోజంతా ఉండి సమస్యలను అధ్యయనం చేసి సరిచేయడానికి శ్రీకారం చేస్తాం. సమస్యలతో ఇబ్బంది పడే రైతులు, భూమి యజమానులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా దీని సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై గ్రామాల్లో ప్రచారం చేయాలి. ఫిర్యాదు చేసిన ప్రతి రైతుకు రసీదు ఇచ్చి భూమిని ఎప్పుడు పరిశీలిస్తామనేది తేదీతో సహా సమాచారం అందిస్తాం.

– బి.దయానిధి, డీఆర్వో

17 నుంచి నెలరోజుల పాటు గ్రామసభలు

జగనన్న భూముల రీసర్వే అంతా గందరగోళంగా మారడంతో రైతుల్లో అయోమయం నెలకొంది. అత్యాధునిక యంత్రాలు, డ్రోన్లతో చేపట్టినా ఇందులోనూ పొరపాట్లు తప్పలేదు. ముఖ్యంగా తగినంత సమయం కేటాయించకుండా లక్ష్యాలతో ఒత్తిడి పెంచడంతో చాలామంది సర్వే ఉద్యోగులు అదరాబాదరగా దీనిని ముగించేశారు. దీనివల్ల భూముల కొలతల సమాచారంలో తప్పులు కొకొల్లలుగా చోటు చేసుకున్నాయి. సందట్లో సడేమియాలా వైకాపా నాయకులు కొందరు సర్వే అధికారులను లోబర్చుకున్నారు. వీరు రైతుల భూముల్లో కొంతభాగం తమ పేరిట నమోదయ్యేలా పత్రాలు సృష్టించారంటున్నారు. ఈ అవకతవకలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కూటమి సర్కారు గ్రామ సభల ద్వారా వీటిని పరిష్కరించేందుకు నిర్ణయించింది.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు (పాతచిత్రం)

208 గ్రామాల్లో సభలు: నర్సీపట్నం డివిజన్లో మొత్తం 208 గ్రామల్లో సభలు నిర్వహించేందుకు కార్యక్రమాన్ని రూపొందించారు. గతంలో 12 మండలాల్లో మొత్తం 357 ఊర్లలో జగనన్న రీసర్వే చేపట్టాలని ప్రతిపాదించారు. 208 పల్లెల్లో సర్వే పూర్తయినట్లు నోటిఫికేషన్ జారీ చేసి సరిహద్దు రాళ్లు పాతారు. ఈ గ్రామాల్లోనే ఇప్పుడు సభలు చేపట్టి రైతులకు ఎదురైన ఇబ్బందులన్నీ తెలుసుకొని వాటిపై విచారణ చేపట్టనున్నారు. సరిహద్దు రాళ్లపై ఉన్న జగనన్న పేరును తొలగించనున్నారు. డివిజన్లో 208 గ్రామాల్లో మొత్తం 2,09,417 రాళ్లు ఉన్నాయని తేల్చారు. ఈ పనులను ప్రత్యేకంగా గుత్తేదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కటింగ్ యంత్రంతో వీటిని చెరిపేసేలా ఏర్పాట్లు చేస్తారు.

సభలకు పక్కా ఏర్పాట్లు: రెవెన్యూ సభలకు పక్కా ఏర్పాట్లు చేపట్టాం. గురువారం నుంచి నెల రోజులపాటు వీటిని నిర్వహించనున్నాం. ఇందుకు మండలాల వారీగా షెడ్యూల్ రూపొందించాం. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తదితరులంతా సభల్లో పాల్గొని అర్జీలు స్వీకరిస్తారు. సభల్లో వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయి పరిశీలించి పొరపాట్లు, ఆక్షేపణలు తదితరాలు అన్నింటినీ గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. 70 రోజుల్లో సమస్యలు పరిష్కరించనున్నాం.



-ఎమ్మార్పీ బాబు, డివిజన్ సర్వే విభాగం పరిశీలకులు

ఆహ్వానం లేకపోవడంపై ఆగ్రహం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: గెమ్మెలిలో జరిగిన పల్లె పండగ కార్యక్రమానికి కూటమి నాయకులకు ఆహ్వానం లేకపోవడంతో ఎంపీడీవోపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. గెమ్మెలి పంచాయతీ కూనేటి గ్రామంలో తెదేపా నాయకులు బుధవారం సమావేశమయ్యారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పల్లె పండగ కార్యక్రమానికి కూటమి నాయకులకు ఆహ్వానం అందించకపోవడమేంటని ప్రశ్నించారు. వైకాపాకు చెందిన వారిని పిలిచి, తమను విస్మరించడం దేనికి సంకేతమన్నారు. నాయకులు లక్ష్మయ్య, రామన్నదొర, దినేష్, భీమన్న, త్రినాథ్, సత్తిబాబు, నితిన్‌కుమార్, బాలరాజు, సూర్యప్రకాష్, చరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తెదేపా నేతకు పరామర్శ

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయలైన తెదేపా సీనియర్ నేత కొండ్ల చినకొండారెడ్డిని తెదేపా మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్ బుధవారం పరామర్శించారు. దామనపల్లి వద్ద ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న కొండరెడ్డికి మెరుగైన వైద్యసేవలను అందించాలని వైద్యాధికారులను కోరారు.

ఉద్యోగాలన్నీ గిరిజనులకే కేటాయించాలి

కొయ్యూరు, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలోని ఉద్యోగాలన్నీ గిరిజనులకే కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. రావణాపల్లిలో బుధవారం సీపీఐ మండల సమితి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జీవో నంబరు 3ను పునరుద్ధరించాలని కోరారు. పార్టీ బలోపేతానికి నేతలు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఉల్లి సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఐ.దేముడు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దర్శి సతీష్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వియ్యపు నానాజీ, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు సత్యవాణి పాల్గొన్నారు.

నేడు మంత్రి లోకేశ్ రాక

విశాఖపట్నం: మంత్రి నారా లోకేశ్ గురువారం విశాఖ రానున్నారు. రాత్రి 10.15 గంటలకు ప్రత్యేక విమానంలో నగరానికి చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి నేరుగా రాక్‌డేల్ లేఅవుట్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు వెళతారు. 18న ఉదయం 10.45గంటలకు జిల్లా కోర్టుకు వెళ్లనున్నారు. 19న తిరుగు ప్రయాణం కానున్నారు.

మత్తు పదార్థాలతో ఎన్నో అనర్థాలు



మారేడుమిల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ

అనంతగిరి, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలతో ఎన్నో అనర్థాలున్నాయని, విద్యార్థులంతా వీటికి దూరంగా ఉండాలని ఎస్సై శ్రీనివాస్‌రావు అన్నారు. శివలింగపురం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్య అభ్యసించాలని పేర్కొన్నారు. గంజాయి జోలికి పోవద్దన్నారు. మత్తు పదార్థాలు వినియోగించడం, సరఫరా చేయడం నేరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



శివలింగపురంలో మాట్లాడుతున్న ఎస్సై

స్నేహపూరిత వాతావరణంలో విద్యాభ్యాసం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులంతా స్నేహపూరిత వాతావరణంలో విద్యాభ్యాసం చేయడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, ర్యాగింగ్ వంటి దురాచారాలకు స్వస్తి పలకాలని మారేడుమిల్లి సీఐ సీహెచ్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. మారేడుమిల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. సామాజిక దురాచారాల పట్ల తమ గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించే విధంగా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ కర్నారావు, ఎస్సై పి.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మోతుగూడెం, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం చిత్రకొండ బ్లాక్ నుంచి ద్విచక్ర వాహనంపై మూడు కేజీల గంజాయిని తరలిస్తుండగా డొంకరాయి పోలీసుస్టేషన్ వద్ద బుధవారం ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన భీమా కడ, త్రినాథ్ కడతోపాటు ఇంతులూరు వాగుకి చెందిన కిలో పరమేష్‌లు ఒకే ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తున్నారు. డొంకరాయి స్టేషన్ వద్ద వాహన తనిఖీ చేస్తుండగా వీరు పట్టుబడ్డారు. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.



నిందితులతో ఎస్సై శివకుమార్, పోలీసు సిబ్బంది

పలు రైళ్ల రీషెడ్యూల్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: లింక్ రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. హౌవ్‌డా-ఎస్ఎంవీటీ బెంగళూరు (12863) ఎక్స్‌ప్రెస్ ఈనెల 16వ తేదీ రాత్రి 10.50గంటలకు బదులు 2.40 గంటలు ఆలస్యంగా అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు.. సంత్రాగచ్చి-సికింద్రాబాద్ (07222) ప్రత్యేక రైలు ఈనెల 16న మధ్యాహ్నం 12.20 గంటలకు బదులు 10.40 గంటలు ఆలస్యంగా రాత్రి 11 గంటలకు బయలుదేరేలా మార్పు చేశారు.

నిరుపయోగంగా ఎత్తిపోతల పథకాలు

చింతూరు, న్యూస్‌టుడే: తుమ్మలలోని ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ చింతూరు ఐటీడీఏ ఎదుట బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తుమ్మల గ్రామస్థులు ధర్నా చేశారు. అనంతరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సీసం సురేశ్ మాట్లాడుతూ సీపీఎం కృషితో మన్యంలో అనేక నదులు, వాగులపై ఎత్తిపోతల పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారన్నారు. అవి మరమ్మతులకు గురైనా అధికారుల పట్టించుకోక నిరుపయోగంగా ఉన్నాయని చెప్పారు. వీటికి మరమ్మతులు నిర్వహించి రైతులకు సాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.



ఐటీడీఏ ఎదుట తుమ్మల గ్రామస్థులు ధర్నా

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు

చింతూరు, న్యూస్‌టుడే: అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలలో విజేతలకు జమాల్ ఖాన్ ట్రస్టు అధినేత జమాల్‌ఖాన్ బుధవారం బహుమతులు అందజేశారు. ఒడిశాలోని వినాయకపురంలో ఏపీ, ఒడిశా రాష్ట్ర క్రీడాకారులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. తుదిపోటీ చట్టి, ఒడిశాలోని మురళిగూడా జట్ల మధ్య జరిగింది. కాగా మురళిగూడా జట్టు విజేతగా నిలిచింది. ఈ రెండు జట్లుకు ట్రోఫీలతో పాటు రూ.20 వేల నగదు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలకు తమ సంస్థ ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జమాల్‌ఖాన్

రెవెన్యూలో కొలిక్కిరాని బదిలీలు

తహసీల్దార్ పోస్టు ఇవ్వలేదని కోర్టులో కేసు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల బదిలీలు ఇంకా కొలిక్కిరాలేదు. బదిలీల ప్రక్రియ ముగిసి 25రోజులైనా ఇంకా విశాఖ జిల్లాలోని ముగ్గురు తహసీల్దార్లు తమకు కేటాయించిన పోస్టుల్లో చేరలేదు. ఫలితంగా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి తహసీల్దార్లు విశాఖకు రాలేని పరిస్థితి. తనను మండల తహసీల్దార్‌గా నియమించలేదని ఏకంగా ఓ తహసీల్దార్ కోర్టును ఆశ్రయించారు. ఆయన్ను విశాఖ కలెక్టరేట్‌లో ఓ విభాగ పర్యవేక్షకుడిగా నియమించారు. ఆ నియామక ఉత్తర్వులను కోర్టులో సవాలు చేశారు. కోర్టు తీర్పు వచ్చినప్పటికీ ఉత్తర్వుల కాపీలు అధికారికంగా రాకపోవడంతో సంబంధిత తహసీల్దార్ విషయంలో అధికారులు తదుపరి చర్యలు తీసుకోలేకపోతున్నారు. ▮ హైకోర్టును ఆశ్రయించిన తహసీల్దార్‌ను ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించారు. ఆయన వెళితేకాని అక్కడి నుంచి జిల్లాకు మరో తహసీల్దార్ రాలేని పరిస్థితి నెలకొంది. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఓ తహసీల్దార్ విశాఖ రాలేదు. దీంతో ఇక్కడి నుంచి మరొకరు అక్కడికి వెళ్లలేని పరిస్థితి ఉంది. ఫలితంగా జిల్లాలో మహారాణిపేట తహసీల్దార్ పోస్టుతో పాటు కలెక్టరేట్‌లో రెండు విభాగాల పర్యవేక్షక పోస్టులు ఇంకా భర్తీ కాలేదు. రెండు మూడు రోజుల్లో ఇవన్నీ కొలిక్కి వస్తాయని జిల్లా అధికారి ఒకరు తెలిపారు. ▮ పెందుర్తి మండల సర్వేయర్‌గా నియమితులైన అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన సర్వేయర్‌ను విధుల్లో చేర్చుకోలేదు. ఆయనపై ఆరోపణలున్న నేపథ్యంలో వెనక్కి పంపారు. ఆ స్థానంలో మరొకర్ని సర్వేయర్‌గా నియమించాల్సి ఉంది.

భార్యను చంపిన భర్తకు రిమాండ్



నిందితుడితో పోలీసులు

హుకుంపేట, న్యూస్‌టుడే: భార్యను చంపిన భర్తకు రిమాండ్ విధించినట్లు సీఐ సన్యాసినాయుడు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని నందాపూర్‌కు చెందిన లభకే ముండు, పనాసంత దంపతులు హుకుంపేట మండలం గన్నేరుపుట్టు గ్రామానికి బతుకుతెరువు నిమిత్తం వచ్చారు. పనాసంత వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 13న లభకేముండు బయటకు వెళ్లి ఇంటికి వస్తుండగా.. వేరే వ్యక్తి ఇంటి నుంచి వెళ్లడాన్ని గుర్తించి భార్యను ప్రశ్నించాడు. ఆమె గొడవకు దిగడంతో మద్యం మత్తులో భార్య మెడపై బలంగా నరకడంతో మృతి చెందింది. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, వారిని బాలల సంరక్షణ కేంద్రంలో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



అంత్రిగుడలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ బాబు

డుంబ్రిగుడ, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి సొంతింటి కలను సాకారం చేసుకోవాలని గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాబు పేర్కొన్నారు. పోతంగి పంచాయతీ పీవీటీజీ గ్రామం అంత్రిగుడను బుధవారం ఆయన సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. మండలవ్యాప్తంగా మొదటి విడతలో 432, రెండులో 70, మూడో విడతలో మరో తొమ్మిది ఇళ్లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. సంస్థ మండల ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ▼ గృహాల నిర్మాణాలపై జీకేవీధిలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2021-22లో మంజూరైన గృహాలను అక్టోబరు నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

గ్రామసభల ఆమోదం లేకుండా మద్యం దుకాణాలా?

పాడేరు, న్యూస్‌టుడే: పీసా చట్టాన్ని ధిక్కరించి ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాలను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం పాడేరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలో పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. గ్రామసభల ఆమోదం లేకుండా మద్యం దుకాణాలు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. లాటరీలో గిరిజనుల పేర్లతో బినామీలు ఎక్కువగా దుకాణాలు దక్కించుకున్నారని ఆరోపించారు. సీపీఎం నాయకులు సుందరరావు, చిన్నయ్యపడాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్సయ్య, చిత్రంలో నేతలు

వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

అడ్డతీగల, న్యూస్‌టుడే: వృద్ధులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అడ్డతీగల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సతీష్ అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక సీహెచ్‌సీలో వృద్ధులు, రోగులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, అవసరమైన మందులు వాడాలని సూచించారు. ఆసుపత్రి కౌన్సిలర్ వాసు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలపై జాగ్రత్త వహించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఆసుపత్రి మత్తు వైద్యాధికారి రచన, చిన్నపిల్లల వైద్యుడు సత్యనారాయణ, హెడ్ నర్స్ నాగమణి, ఎన్‌సీడీ నర్స్ సీతాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ సతీష్

సమాజాభివృద్ధే ధ్యేయం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధే ధ్యేయంగా మనం సేవా సొసైటీ సభ్యులు ముందుకు సాగుతున్నారని ఎంఈవో పనసల ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రస్ట్ నిధులతో విద్యార్థులు చేతులు కడుక్కునేందుకు అవసరమైన నీటి ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. ఎంఈవో చేతులమీదుగా వీటిని ప్రారంభించారు. ట్రస్ట్ ఛైర్మన్ గౌతమ్ నరేంద్ర మహర్షి, హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరల పెంపుతో ఇబ్బందులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని సీపీఎం నేత వై.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. డౌనూరులో గిరిజనులతో కలిసి నిరసన తెలిపారు. ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రైకార్ ద్వారా గిరిజన యువతకు రుణాలు ఇవ్వాలన్నారు. నేతలు సోమయ్య, రాజు, సిద్ధు, రాము, పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

పాఠశాల ఏర్పాటు చేయాలని వినతి

ఎటపాక, న్యూస్‌టుడే: తమ గ్రామంలో పాఠశాల లేక పిల్లలు పశువుల కాపరులుగా మారుతున్నారని తక్షణమే పాఠశాల ఏర్పాటు చేయాలని మండలంలోని సాలిబడప గ్రామస్థులు బుధవారం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్లుగా గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయలేదని దీంతో తమ పిల్లలకు చదువుకునే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

చింతూరు, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో పనిచేస్తున్న కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం చింతూరు ఏటీడబ్ల్యూవో సుజాతకు వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ చెప్పారు. తక్షణమే కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు. పొడియం లక్ష్మణ్, దుర్గారావు, వీరయ్య, పుల్లమ్మ, చంద్రమ్మ పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న సాలిబడప గ్రామస్థులు

జీపు బోల్తా.. పలువురికి గాయాలు

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: జీపు బోల్తా పడి పలువురు గాయాలపాలైన ఘటన బురుడాయిల్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పెదబయలు మండలం బొండాపల్లి పంచాయతీ వెదిరిగుప్పకు చెందిన ఆర్లాబ్ బాలన్ననాయుడు తదితరులు డుడుమ జలపాతం సందర్శనకు జీపులో బయలుదేరారు. జోలాపుట్ జలాశయం చూసి డుడుమ వస్తుండగా.. బురుడాయిల్ సమీపంలోని మలుపు వద్ద జీపు అదుపుతప్పి బోల్తాపడింది. జీపు కింద వృద్ధురాలు ఆర్లాబ్ ఎర్రబుడ్డి ఉండిపోవడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వస్తున్న వాహన చోదకులు, జీపులో ఉన్న మిగిలిన వారు ఆమెను బయటకు తీశారు. శంకర్‌రావు, ఆర్లాబ్ బాలన్నాయుడు, ఆర్లాబ్ లావణ్యలకు కూడా గాయాలయ్యాయి. వీరందరినీ ప్రాజెక్టు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో వాహనంలో మొత్తం 12 మంది వరకు ఉన్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పీహెచ్‌సీల్లో మౌలిక సదుపాయాల కల్పన

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నివేదికలు అందజేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులతో పీవో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో ఉన్న 19 పీహెచ్‌సీలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకు ప్రతిపాదనలను తయారు చేయాలన్నారు. 104 వాహనాల స్థితిపై ప్రతినెలా తనకు నివేదిక సమర్పించాలన్నారు. ఈ నెల 17, 18 తేదీలలో రెండు రోజులపాటు వివిధ రకాల వ్యాధులు గుర్తించేందుకు సర్వే నిర్వహించాలని ఆదేశించారు. పీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ఏవిధంగా అమలు చేస్తున్నది అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ విభాగం ద్వారా గ్రామాల్లో సామాజిక భవనాలు నిర్మించేందుకు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఐటీడీఏ ఏపీవో డీఎన్వీ రమణ, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ శిరీషా, గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయశాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఐ.శ్రీనివాసరావు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు, సీడీపీవో సంధ్యారాణి పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీవో


డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాల్లో మెగా డీఎస్సీకి గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం తెలిపారు. సాంఘిక, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. బీఈడీ, డీఈడీ.. టెట్ పాసైన అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉండి, ఆసక్తి కలిగిన గిరిజన అభ్యర్థులంతా ఈ నెల 21లోపు జ్ఞానభూమి పోర్టల్ jnanabhumi.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులను నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హత పరీక్షను నిర్వహిస్తామని పీవో వివరించారు.

బండి కనిపిస్తే మాయం!

మీ ద్విచక్రవాహనాలు నిలిపి వెళ్తున్నారా..

అయితే తిరిగి వచ్చాక ఉంటాయో లేదో గ్యారంటీ లేదు అన్నట్లుంది ప్రస్తుత పరిస్థితి. జిల్లావ్యాప్తంగా అన్ని చోట్ల జరుగుతున్న దొంగతనాలకు.. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాల సంఖ్యకు పొంతన ఉండడం లేదు. సామాన్య ప్రజలు భారీగా వాహనాలు నష్టపోతున్నారు.



పాడేరు, న్యూస్‌టుడే

పాడేరు ఐటీడీఏ రేకుల కాలనీకి చెందిన సచివాలయ ఉద్యోగి టమికే శివశంకర్ ఈనెల 7వ తేదీన ఇంటి ముందు ద్విచక్రవాహనం నిలిపారు. సాయంత్రం ఎనిమిది గంటల సమయంలో దీన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేయకుండా.. వివరాలు ఇవ్వండి.. దొరికితే చెబుతాం అంటూ పోలీసులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

పేద మధ్య తరగతి కుటుంబాలకు ద్విచక్రవాహనమే ఆధారం. అది లేనిదే పని జరగదు. పైసాపైసా కూడబెట్టి కొనుక్కుంటే కళ్లు మూసి తెరిచేలోగా మాయం చేస్తున్నారు. పాడేరు మన్యంలో ఈ ముఠాలు ఎక్కువగా ఉన్నాయి. ముగ్గురు, నలుగురు బృందంగా ఏర్పడి పథకం ప్రకారం దొంగతనాలకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాలు, నిఘా తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాహనాలు నిలిపేవారినే లక్ష్యంగా చేసుకుంటున్నారు.

● దొంగిలించిన వాహనాల్లో విడి భాగాలను తీసేసి అమ్మేస్తున్నారు. గత ఏడాది ఏజెన్సీ ప్రాంతం నుంచి ఒడిశాకు ఇలా తరలించారు.

అంతా పథకం ప్రకారమే!

జిల్లాలో గత మూడేళ్లుగా నమోదు చేసిన కేసులు/ స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలు ఇలా

సంవత్సరం	కేసుల నమోదు	స్వాధీనం	దొరకనివి
2022	30	18	12
2023	13	9	4
2024 (నేటి వరకు)	3	2	1
మొత్తం	46	29	17

కేసుల నమోదుపై నిర్లక్ష్యం

వాహనదారులు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదు. పది వాహనాలు చోరీ జరిగితే రెండు, మూడు కేసులు కూడా నమోదు కావడం లేదు. రికవరీ అవుతాయనుకున్న వాటినే నమోదు చేసి 90 శాతం రికవరీ చూపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎస్పీ అమిత్‌బర్ధార్‌ని వివరణ కోరగా.. సాధ్యమైనంత వేగంగా వీటిని పట్టుకుంటున్నామని, ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యేలా చూస్తామని తెలిపారు.


పోలీసులు పట్టుకున్న బైక్‌లు పరిశీలిస్తున్న అప్పటి ఎస్పీ తుహిన్ సిన్హా

● పాడేరు పట్టణంలో ఇటీవల ఓ చెప్పుల వ్యాపారి దుకాణం ముందు నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. వాహనదారుడు ఇంటికి వెళ్లేందుకు బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీనిపై పట్టణంలో గాలించగా.. ఐటీడీఏ రేకుల కాలనీలో బర్సింగి మార్గంలో ఓ కారుపక్కన విడిచిపెట్టారు.

అవీ ఇవీ

బాధితులకు పరామర్శ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: మాడగడ గ్రామంలో కలుషిత తాగునీటితో అస్వస్థతకు గురైన బాధితులకు మెరుగైన వైద్యం, ప్రభుత్వ సహాయం అందించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. అరకులోయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం గిరిజన సంఘం, సీపీఎం నాయకులు వేర్వేరుగా పరామర్శించారు. గ్రామంలో రక్షిత తాగునీరు, డ్రైనేజీ సదుపాయం కల్పించాలన్నారు. గిరిజన సంఘం, సీపీఎం నాయకులు బుజ్జిబాబు, సత్యారావు, మగ్గన్న, ఐటీడీఏ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సత్కారం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: అందరి సహకారంతో మండల అభివృద్ధికి చర్యలు చేపడతానని ఎంపీడీఓ శ్రీసాయిహర్ష అన్నారు. బుధవారం మండల పరిధిలోని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓను కలిసి సమస్యలు వివరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను సత్కరించారు. సర్పంచులు బాబూరావు, గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు నబ్బో, కమల, నాయకులు మూర్తి, జగబందు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొద్దు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలను గుడి, బడికి దూరంగా ఏర్పాటు చేయాలని గిరిజన మహిళా సంఘం అధ్యక్షులు ఈశ్వరి డిమాండు చేశారు. ముంచంగిపుట్టులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద, ఆంజనేయస్వామి ఆలయానికి సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని తహసీల్దార్ నర్సమ్మకు వినతిపత్రం అందించారు. నాలుగురోడ్ల కూడలి వద్ద దుకాణం ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య, ఘర్షణలు పెరిగి జనజీవనానికి ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు.

మూగబోయిన బీఎస్ఎన్ఎల్ సేవలు

సీలేరు, న్యూస్‌టుడే: గాలికొండ పంచాయతీ సప్పర్ల బీఎస్ఎన్ఎల్ టవర్ గత 45 రోజులుగా పనిచేయక వినియోగదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. సంకేతాలు అందక అన్ని కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ స్పందించలేదని స్థానికులు చెబుతున్నారు. సంకేతాల కోసం సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధారకొండ, గూడెంకొత్తవీధి వెళ్లాల్సి వస్తోందని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని నాగబాబు, పండా రామకృష్ణ, సుబ్బారావు కోరుతున్నారు.

పింఛన్లు మంజూరు చేయాలని వినతి

రంపచోడవరం, న్యూస్‌టుడే: తామంతా సామాజిక పింఛన్లకు అర్హులైనప్పటికీ గత ప్రభుత్వం మంజూరు చేయలేదని పలువురు గిరిజనులు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో విజయభాస్కర్‌ను అడ్డతీగల మండలం దాన్యంపాలెం, దాపరాతిపాలెం, రావిగూడెం, పెనికలపాడు, జల్లూరి, చిన్నమెనకలగడ్డ, తీయమామిడి, చెట్టుపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులు బుధవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. గత ఐదేళ్ల కాలంలో తాము పలుమార్లు పింఛన్లు మంజూరు చేయాలని అధికారుల చుట్టూ తిరిగామని, అయినా న్యాయం చేయలేదని తెలిపారు.

నిబంధనలు పాటించాల్సిందే: పీఓ అభిషేక్

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహిస్తున్న యాజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాల్సిందేనని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ స్పష్టం చేశారు. అరకులోయ మండల పరిషత్తు సమావేశ మందిరంలో అరకులోయ పరిసరాల్లోని హోటళ్ల నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ధరలకు తగ్గ సౌకర్యాలు కల్పించాలని, ప్లాస్టిక్ నిషేధం విధిగా అమలు చేయాలని పేర్కొన్నారు. హోటళ్ల వద్ద గదుల అద్దెలు, నిర్వహణ వివరాలు ప్రకటించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. క్యాంపింగ్ టెంట్లకు పంచాయతీ, విద్యుత్తు, పోలీసు శాఖల అనుమతి తప్పనిసరి అని చెప్పారు. స్థానిక గిరిజనులకే ఈ అవకాశం కల్పించాలన్నారు. ఐటీడీఏ ఏపీఓ ప్రభాకరరావు, డీపీఓ లవరాజు, డీఎల్‌పీఓ కుమార్, ఎంపీడీఓ లవరాజు, మ్యూజియం, గార్డెన్ మేనేజర్ మురళి, బొంజుబాబు, హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు పాల్గొన్నారు. ● గిరిజన విద్యార్థులకు ఉన్నత చదువులపై అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ అన్నారు. గిరిజన సంక్షేమ విద్య సహాయ అధికారులు, మాస్టర్ ట్రైనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జి డీడీ ఎల్ఎల్ రజిని, ఏటీడబ్ల్యూఓలు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.


అరకులోయలో హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అభిషేక్

గోదాం.. భయం భయం


ముంచంగిపుట్టులోని జీసీసీ గోదాంలో కుళ్లిన చింతపండు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ప్రజలకు పంపిణీ చేసే బియ్యం, ఇతర నిత్యావసర సరకులు నిల్వ ఉంచే గిరిజన సహకార సంస్థ గోదాములు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముంచంగిపుట్టులో ముప్పై ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు నీరుగారుతున్నాయి. గోడలు కూలిపోతున్నాయి. ఎలుకలు లోపలకు చేరి సరకులను నాశనం చేస్తున్నాయి. భవనాలకు కనీస మరమ్మతులు చేపట్టక సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేదలకు అందించే నిత్యావసర సరకులతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో భోజన పథకం అమలుకు అవసరమయ్యే సరకులను ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నారు. ఇవి పాడైపోతున్నా వాటినే అందిస్తున్నారు. దీంతో ప్రజారోగ్యం దెబ్బతింటోందనే విమర్శలు వస్తున్నాయి.


ఎలుకలు పాడుచేసిన భవనం నేల

కొత్త భవనాలు నిర్మించేదెప్పుడో!

పౌరసరఫరాలశాఖ, గిరిజన సహకార సంస్థ, పాడేరు ఐటీడీఏ సంయుక్తంగా కొత్త భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. ముంచంగిపుట్టు జీసీసీ గోదాం నుంచి 46 డీఆర్‌డిపోల పరిధిలో ఉన్న 15,375 బియ్యంకార్డులకు ప్రతి నెలా 350 టన్నుల బియ్యంతో పాటు ఇతర సరకులు సరఫరా చేస్తుంటారు. సుమారు 60 వేల మంది ప్రజలకు వీటిని అందిస్తుంటారు. గోదాంలకు కొత్త భవనాలు నిర్మించాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు మహర్దశ

ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని తెదేపా మండల కార్యదర్శి జగత్రాయ్ అన్నారు. బుధవారం పెదగుడ, ఏనుగురాయి గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమం నిర్వహించారు. మట్టి తవ్వకాలకు శంకుస్థాపన చేశారు. సర్పంచి రమేష్, ఎంపీడీఓ శ్రీసాయిహర్ష, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, ఉపాధిహామీ పథకం ఏపీఓ తదితరులు పాల్గొన్నారు. గుంటసీమ, గుంటగన్నెల, రంగిలిసింగి పంచాయతీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, తెదేపా మండల అధ్యక్షుడు సుబ్బారావు, సర్పంచులు నాగేశ్వరరావు, లక్ష్మి, మోతిలాస్, ఏపీవో సూరిబాబు పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కొమ్మంగి, కిటుముల, గొందిపాకలు పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. సర్పంచులు రమణమ్మ, వరలక్ష్మి, తెదేపా నాయకులు చల్లంగి లక్ష్మణరావు, జనసేన మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, భాజపా నాయకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట, అనంతగిరి, న్యూస్‌టుడే: దాలిగుమ్మడి గ్రామంలో అభివృద్ధి పనులను సర్పంచి పూర్ణిమ ప్రారంభించారు. చంద్రపడాల్, రామయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు. కొండిబ పంచాయతీ కేంద్రంలో పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, దయానిధి, దొన్ను తదితరులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూనవరం, న్యూస్‌టుడే: చినార్కూరులో బుధవారం పల్లె పండగలో భాగంగా పలు అభివృద్ధి పనులను ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచి సున్నం రాంబాబు ప్రారంభించారు. పంచాయతీలకు వచ్చిన నిధులతో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యం ఇచ్చి ప్రజల కష్టాలను తీర్చాలన్నారు. కార్యదర్శి శివమణికంఠ, ఉపాధిహామీ పథకం సాంకేతిక నిపుణుడు శ్రీనివాసరావు, నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.


దాలిగుమ్మడిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచి పూర్ణిమ తదితరులు


చినార్కూరులో మాట్లాడుతున్న ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచి రాంబాబు

ఒప్పంద అధ్యాపకుల ఆందోళన

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ఒప్పంద అధ్యాపకుడు బుల్లిరాజు తదితరులు కోరారు. జి.మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు బుధవారం పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. 24 ఏళ్లుగా పని చేస్తున్నా తమ సర్వీసులను క్రమబద్ధీకరించలేదన్నారు. జీవో నంబర్ 114ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పంద అధ్యాపకులు మోహన్‌బాబు, వెంకటరమణ, వేణు, రమణ, త్రివేణి, తిరుపతమ్మ, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఎన్నికల కోడ్ వల్ల నిలిచిపోయిన ఒప్పంద అధ్యాపకుల సర్వీసుల క్రమబద్ధీకరణను వెంటనే అమలు చేయాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట బుధవారం పసుపు బ్యాడ్జీలను ధరించి అధ్యాపకులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఒప్పంద అధ్యాపకులు రామకృష్ణ, వీర్రాజు, ఫణీంద్రుడు, రాజ్‌కుమార్, ఆచార్యులు, విశాలాక్షి, విమలకుమారి, అనిత, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.


ఆందోళనలో పాల్గొన్న రంపచోడవరం అధ్యాపకులు

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో నేటినుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న జిల్లాస్థాయి అండర్-14 బ్యాడ్మింటన్ పోటీలకు అరకులోయ క్రీడా పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు శిక్షకుడు కె.రాజుబాబు, ప్రిన్సిపల్ మూర్తి తెలిపారు. బి శశిధర్‌రెడ్డి, ఎస్ సాన్వితేజ, బి యశ్వంత్‌తేజ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను, కోచ్‌ను ప్రిన్సిపల్ అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో శిక్షకుడు రాజుబాబు

సేంద్రియ సాగుతో మేలు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: సేంద్రియ విధానాలతో పండించిన పంటలతో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని మత్స్యదేవత రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో హనుమంతరావు తెలిపారు. సొలభం పంచాయతీ తాసేరుబయలులో బుధవారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలైన సామలు, రాగులు పండించి అధిక దిగుబడి పొందాలన్నారు. జి.మాడుగుల యూనిట్ ఇన్‌ఛార్జి మహేశ్వరి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు, న్యూస్‌టుడే: ధారకొండలో మండల వ్యవసాయాధికారి మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త బాలహుస్సేన్‌రెడ్డి పాల్గొన్నారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.


తాసేరుబయలులో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


పెదగరుడు బాలికల పాఠశాలలో ఓటు నమోదు కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

హుకుంపేట, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు తమ ఓట్లు నమోదు చేసుకోవాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సత్యారావు పేర్కొన్నారు. పెదగరువు బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులతో ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు కొండమ్మ, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు ఎంపీడీవోగా రమేష్‌నాయుడు



కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు ఎంపీడీవోగా బి.రమేష్ నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్బవరంలో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన మేరీరోజ్ గొలుగొండ మండలానికి బదిలీ అయ్యారు.

రాజవొమ్మంగి తహసీల్దార్‌గా సూర్యారావు



రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగి తహసీల్దార్‌గా కె.సూర్యారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కె.గంగవరం మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. సిబ్బందిలో కలిసి ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించేలా పనిచేస్తామన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కె.సత్యనారాయణ దేవీపట్నం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

రూ. 67కే కేజీ కందిపప్పు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాల ద్వారా తెల్లరేషన్‌కార్డుదారులకు కేజీ కందిపప్పు రూ. 67కే పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామని పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి గణేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. కిలో కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం రూ. 140 నుంచి రూ. 160 వరకు ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం.. జిల్లాలోని 2,98,092 మంది కార్డుదారులకు నవంబరు నుంచి కిలో రూ. 67కే పంపిణీ చేస్తామన్నారు. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులు అధికశాతం దీన్ని తీసుకోవడం లేదని తమకు సమాచారం అందుతోందన్నారు. రాయితీపై అందిస్తున్న ఈ కందిపప్పును కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయురాలు కృష్ణవేణి సస్పెన్షన్

రంపచోడవరం, న్యూస్‌టుడే: అడ్డతీగల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలు సీహెచ్ కృష్ణవేణిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణవేణి ఇటీవల చెక్‌బౌన్స్ కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదల అయ్యారన్నారు. విషయం తెలుసుకుని శాఖాపరమైన చర్యల్లో భాగంగా ఈమెను సస్పెండ్ చేసినట్లు డీడీ పేర్కొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత రేపు

పాడేరు, న్యూస్‌టుడే: ఈనెల 18వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాడేరు డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎ.వి.ఎన్ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు మండలంలోని వంట్లమామిడి, కోటలగరువు, కందమామిడి, బంగారుమెట్ట, పెదబయలు మండలంలోని రూఢకోట, గోమంగి, జామిగుడ, కుమడ, అనంతగిరి మండలంలోని భీసుపురం, మరడగూడ, లక్ష్మీపురం, దిగువశోభ, చిలకలగెడ్డ, కాశీపట్నం, ఎన్ఆర్ పురం గ్రామాలకు విద్యుత్తు సరఫరా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: వర్షాలతో మండలంలోని ఇమ్మిడివరం-గుంజుగూడెం రహదారి కోతకు గురైంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.
– చిలకల సత్యనారాయణ, గుంజుగూడెం

✓: వర్షాలతో పాడైన రోడ్లకు త్వరలో మరమ్మతులు చేపడతాం. నిధులు మంజూరైన వెంటనే పనులను చేపట్టి ఇబ్బందులను తొలగిస్తాం. – ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, రంపచోడవరం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే:



?: మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారిలో విద్యాలయాల ప్రాంగణం వద్ద బస్ షెల్టరు లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
– రమణ, మారేడుమిల్లి

✓: మారేడుమిల్లిలోని విద్యాలయాల ప్రాంగణం వద్ద బస్‌షెల్టరు నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపిస్తాం.
– వెంకటరమణ, మండల ఇంజినీరింగ్ అధికారి, మారేడుమిల్లి

?: మారేడుమిల్లి నుంచి రాజమహేంద్రవరం వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపైకి చెట్లు ఒంగిపోయి, ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారిలో ప్రయాణించేవారు ఎప్పుడు, ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.
– సత్యనారాయణ, మారేడుమిల్లి

✓: మారేడుమిల్లి శివారులో అంతర్రాష్ట్ర రహదారిపైకి ప్రమాదకరంగా ఉన్న చెట్లు తొలగించడానికి చర్యలు చేపడతాం. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూస్తాం.
– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, మారేడుమిల్లి

గ్రామాల అభివృద్ధికి శిక్షణ దోహదం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మండలంలోని 23 పంచాయతీలకు చెందిన ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కల్పించేందుకు బుధవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీసాయిహర్ష వీటిని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి శిక్షణ దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల ఏర్పాటు, నిర్మాణం, నిర్వహణ, నియంత్రణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈఓఆర్డీ చిన్నాన్న, శిక్షకులు సోమేశ్వరరావు, సత్యరంజన్, ప్రవీణ్‌కుమార్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇస్తున్న కార్యదర్శి

కార్యదర్శులతో సమీక్ష

వై.రామవరం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీఓ బాపన్నదొర పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అన్నారు. సచివాలయ సిబ్బంది చేయాల్సిన విధులు చేపట్టాల్సిన పనులపై వివరించారు. ఈఓపీఆర్డీ శివకుమార్ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో కాంస్య పతకం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి యోగా ఛాంపియన్‌షిప్ పోటీల్లో అచ్యుతాపురం పోలీసు కానిస్టేబుల్ ముడిల నిర్మల కాంస్య పతకం పొందారు. సెప్టెంబర్ 23 నుంచి 27 వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయిలో నిర్వహించిన పోటీల్లో నిర్మల ప్రతిభ కనబరిచి పతకం పొందారు. ఈమె బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించి, మరిన్ని పోటీల్లో పాల్గొని మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.